

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానమే లక్ష్యం 8లో



'సంపత్ వినాయగర్' హుండీ ఆదాయం రూ.16 లక్షలు 8లో



దంచికొట్టిన వాన 8లో

న్యూస్‌రీల్

సింహాచలం ఈవోగా త్రినాథరావు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవోగా దేవదాయ శాఖ సంయుక్త కమిషనర్ వి.త్రినాథరావు నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమల దేవస్థానం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న త్రినాథరావును ఇక్కడకు బదిలీ చేస్తూ ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా త్రినాథరావు సింహాచలం దేవస్థానం ఈవోగా రావడం ఇది నాల్గోసారి. గతంలో ఆయన మూడుసార్లు ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అన్నవరం దేవస్థానం ఈవోగా ఉంటూనే 2020 సెప్టెంబర్ 2 నుంచి 2021 జనవరి 22 వరకు, ద్వారకా తిరుమల ఈవోగా పని చేస్తూ 2022 సెప్టెంబర్ 22 నుంచి 2023 జూన్ 10 వరకు, 2023 జూన్ 26 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఇక్కడ పనిచేశారు. ఇప్పుడు బదిలీపై పూర్తిస్థాయి ఈవోగా వస్తున్నారు. గతంలో ఆయన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా, డిప్యూటీ కమిషనర్‌గా విశాఖలో విధులు నిర్వర్తించారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.5 లక్షల విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి రూ.5 లక్షల విరాళాన్ని నలుగురు దాతలు గురువారం అందించారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ ప్రాంతానికి చెందిన బూరుగుపల్లి శివరామకృష్ణ ప్రసాద్, రాజమండ్రికి చెందిన బూరుగుపల్లి నితీష్ కృష్ణ, బూరుగుపల్లి తిమ్మరాజు, బూరుగుపల్లి వెంకట్ తిమ్మరాజు రూ.1.25 లక్షలు చొప్పున మొత్తం రూ.5 లక్షల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు అన్నప్రసాద పథకం బాండ్‌ని సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు అందించారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు. దేవస్థానం ఉద్యోగి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కేజీహెచ్ సీఎస్సార్ఎంవోగా డాక్టర్ మోహర్ కుమార్



మహారాణిపేట: కేజీహెచ్ సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్సార్ఎంవో)గా డాక్టర్ మోహర్ కుమార్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత 14 ఏళ్లుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. డాక్టర్ మోహర్ కుమార్ ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఇప్పటివరకు విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

ఐదు స్కూల్ బస్సులపై కేసులు



తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు


గోపాలపట్నం: నిబంధనలు పాటించని ఐదు బస్సులపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేసి, ఒక బస్సును సీజ్ చేశారు. మద్దిలపాలెం, ఎన్ఎస్‌టీఎల్ వద్ద జాతీయ రహదారిపై, రేవిడి, వేపగుంట, పద్మనాభం, మారికవలస, ఇసుకతోట, పెందుర్తి, వీఎంఆర్డీఏ పార్కు తదితర ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పలు నిబంధనలు ఉల్లంఘించిన ఐదు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేసి, ఒక బస్సును సీజ్ చేసినట్లు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. జూన్ 13 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో 100 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. 46 స్కూల్ ఆటోలపై కేసులు నమోదు చేసి, ఐదు ఆటోలను సీజ్ చేశామన్నారు.

ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: జిల్లా మహిళా శిశు సంక్షేమం, సాధికారత శాఖ కార్యాలయంలో సక్షం అంగన్వాడీ, పోషణ్ 2.0 జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్ట్ భర్తీకి ఆ సంస్థ కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్ట్ భర్తీ చేయనున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30లోపు ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలి. https://visakhapatnam.ap.gov.in/ నుంచి దరఖాస్తు పొందవచ్చు.

100 రోజుల దగా

అలవికాని హామీలు.. అడుగడుగునా అబద్ధాల కోటలు కట్టి అందలమెక్కిన కూటమి ప్రభుత్వం.. వంద రోజులైనా ఏ ఒక్క హామీని పట్టించుకోకుండా గాలి కొదిలేసింది. అధికారంలోకి వస్తే.. అది చేస్తాం.. ఇది చేస్తామంటూ ఉత్తర కుమారుల ప్రగల్భాలు **పలికిన చంద్రబాబు.. ఇప్పుడు ఉత్త** చేతులు చూపిస్తున్నారు. **సూపర్ సిక్స్ పథకాలకే కాదు..** స్థానికంగా ఇచ్చిన హామీ**లకు మంగళం పాడేస్తున్నారు.** పలుమార్లు జిల్లాకు వచ్చినా **హామీల గురించి ఏ మాత్రం** ప్రస్తావించకుండా రిక్త హస్తా**లతో దగా చేస్తున్నారు.** ఎన్నికల ప్రచారంలో వంగి **వంగి వందనాలు పెట్టిన కూటమి** నేతలు.. ఇప్పుడు ఓట్లేసిన **ప్రజలందరికీ పంగనామాలు** పెడుతున్నారు. సీఎంచం**ద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్** కల్యాణ్, మంత్రి లోకేష్.. **జిల్లాలో పర్యటించినప్పుడు** ఇచ్చిన హామీలేంటి.? **అవి కార్యరూపం దాల్చాయా** లేదా అన్నది 100 రోజు**ల పాలన సందర్భంగా** ఓ సారి చూద్దాం.. **– సాక్షి, విశాఖపట్నం**



- పంచ గ్రామాల సమస్య పరిష్కరిస్తానని చంద్రబాబు ప్రగల్భాలు
- ట్రాఫిక్ సమస్యకు **చెక్** పెడతానని **వాగ్దానాలు**
- విశాఖను ఆర్థిక రా**జధాని చేస్తానని** ప్రతీసారి బీరాలు
- వంద రోజుల కూట**మి ప్రభుత్వ** పాలనలో నెరవేరని **ఏ ఒక్క హామీ**
- డీపీఆర్ పేరుతో వైజాగ్ మెట్రోను కాలయాపన చేసేందుకు పన్నాగం
- స్టీల్‌ప్లాంట్ ఉద్యమాన్ని అణగదొక్కే ప్రయత్నం
- అడుగడుగునా జిల్లాను దగా చేసిన కూటమి సర్కారు

ట్రాఫిక్ సమస్య తీరుస్తా..

అధికారంలోకి వస్తే.. నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడతా.. మా వైజాగ్ ప్రజలు ట్రాఫిక్‌తో ఎంత ఇబ్బందులు పడుతున్నారో అర్థమవుతోంది. ఫ్లైఓవర్లు తీసుకొస్తా అంటూ గాజువాక సభలో చంద్రబాబు మాట్లాడారు.

కానీ.. ఇటీవల పర్యటనలో భాగంగా జిల్లా అధికారులతో ఎయిర్‌పోర్టులో సమావేశమైన చంద్రబాబు ట్రాఫిక్ సమస్య గురించి గానీ, ఫ్లైఓవర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలపైనా ఎలాంటి ప్రస్తావన తీసుకురాలేదు. ఈ వివరాలను తీసుకుని అధికారులు హాజరైనా.. చంద్రబాబు ఆ టాపిక్‌ను పక్కన పెట్టేసినట్లు తెలిసింది.



గాజువాక సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

విశాఖను ఆర్థిక రాజధాని చేస్తా..

విశాఖలో పర్యటించిన ప్రతీసారి చంద్రబాబు నోటి వెంట వచ్చే మొదటి మాట.. 'వైజాగ్‌ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాను. ప్రపంచ పటంలో నిలబెడతాను'. ఈ ఎన్నికల సమయంలోనూ ఇదే మాట వల్లెవేశారు.

జరిగిందా.?

1995 నుంచి వివిధ దఫాలుగా సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబు.. తాను చెప్పిన ఆర్థిక రాజధాని అబద్ధాన్ని నిజం చేయాలన్న ఆలోచన ఏ కోశానా చేయలేదు. మాటలతోనే కోటలు కట్టేస్తున్నారే తప్ప.. వైజాగ్ అభివృద్ధి కోసం ఏనాడూ పాటుపడలేదు. ఇటీవల మెడ్‌టెక్ జోన్‌కు వచ్చిన చంద్రబాబు ఇకపై అమరావతిలో గ్లోబల్ సమ్మిట్లు నిర్వహిస్తామని చెప్పడం చూస్తే.. విశాఖలో ఇకపై అంతర్జాతీయ సదస్సులు జరగవని స్పష్టమవుతోంది. వైఎస్సార్ సీపీ హయాంలో విశాఖ నగరం అద్భుతంగా రూపుదిద్దుకుంది. అంతర్జాతీయ సంస్థలు.. ఇన్ఫోసిస్, డబ్ల్యూఎన్‌ఎస్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్ మొదలైన దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు విశాఖకు క్యూ కట్టాయి. జీఐఎస్–2023లో 46 దేశాల ప్రతినిధులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు హాజరై విశాఖ అభివృద్ధిని ప్రపంచ దేశాలకు పరిచయం చేశారు. ఇలా అన్ని రంగాల్లోనూ విశాఖను ముందుకు తీసుకెళ్తూ.. కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. కానీ.. మూడు దశాబ్దాలుగా ఆర్థిక రాజధాని చేస్తామంటూ బీరాలు పలుకుతున్న చంద్రబాబు మాత్రం.. వైజాగ్‌పై నిరంతరం ఏదో ఒక రకంగా వివక్ష చూపిస్తూనే ఉన్నారు.



నగరంలో జరిగిన సభల్లో మాట్లాడుతున్న, చంద్రబాబు, లోకేష్

పంచగ్రామాలకు మోక్షం..

పంచగ్రామాల సమస్యకు పరిష్కారం చూపిస్తాను. దశాబ్దాలుగా బాధపడుతున్న ప్రజల కన్నీటిని తుడుస్తానంటూ పెందుర్తిలో జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడారు.

కానీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు కేబినెట్ సమావేశం జరిగినా.. పంచగ్రామాల సమస్య ప్రస్తావనే వినిపించలేదు. వాస్తవానికి పంచ గ్రామాల భూసమస్య గడిచిన 24 ఏళ్లు నుంచి నడుస్తోంది. 1996లో టీడీపీ హయాంలోనే ఈ సమస్య మొదలైంది. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోనూ ఈ భూసమస్యను 100 రోజుల్లో పరిష్కారం చేస్తామన్నారు. కానీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో పంచ గ్రామాల పరిధిలోని ఇళ్ల మరమ్మతులకు అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రభుత్వం మాత్రం 100 రోజులు గడిచినా ఈ సమస్యను పట్టించుకోలేదు.



విశాఖ పర్యటనలో పంచగ్రామాల సమస్యను పరిష్కరిస్తానన్న బాబు



భరణికంలో మాట్లాడుతున్న లోకేష్(ఫైల్)

మెట్రో రైలు తీసుకొస్తాను..

'విశాఖకు గత ప్రభుత్వం మెట్రో రైలు తీసుకురావడంలో విఫలమైంది. ఈ సారి అధికారంలోకి వస్తే మెట్రోరైలు తీసుకొచ్చే బాధ్యత నాదీ' అంటూ ఉత్తర నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు బీరాలు పలికారు.

కానీ.. 2014–19 మధ్యలో మెట్రో డీపీఆర్ కేంద్రానికి పంపించామంటూ చంద్రబాబు అబద్ధాలు వల్లెవేశారు. కానీ డీపీఆర్ పంపించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తూ లైట్‌మెట్రో ప్రాజెక్టు పట్టాలెక్కించేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసింది. ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ను పంపించింది. ఇప్పుడు మరోసారి చంద్రబాబు మెట్రో ప్రాజెక్టకి మోకాలడ్డే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇటీవల విశాఖలో పర్యటించిన సీఎం చంద్రబాబు మెట్రో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పూర్తి స్థాయిలో మెట్రో డీపీఆర్ తయారు చేసినట్లు వివరించినా.. చంద్రబాబుకి మాత్రం ఆ డీపీఆర్ నచ్చలేదని చెప్పేశారు. మళ్లీ కొత్తగా డీపీఆర్ తయారు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. వైజాగ్‌కు మెట్రో రాకుండా చూసేందుకే ఈ తరహా ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ ఐదేళ్లు అదిగో మెట్రో.. ఇదిగో మెట్రో అంటూ పాత పాటే పాడటం ఖాయంగా కనిపిస్తోంది.



పశ్చిమ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

ఉక్కు సంకల్పమంటూ ఉత్తుత్తి మాటలు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్.. ఇతర కూటమి నేతలు.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రగల్భాలెన్నో పలికారు. ప్లాంట్ ప్రైవేటీకరణ జరగాలంటే.. ముందు మమ్మల్ని దాటి వెళ్లాలంటూ పవన్ కల్యాణ్ బీరాలు పలికారు. అవసరమైతే కార్మిక నేతలతో కలిసి ఢిల్లీ వెళ్తానంటూ గొప్పలు చెప్పారు.

కానీ.. ప్రైవేటీకరణ కాకుండా గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు ప్లాంట్‌ను కాపాడింది. అయితే అధికారంలోకి వచ్చిన 100 రోజులకే కూటమి ప్రభుత్వం.. ప్లాంట్‌ను అప్పనంగా అప్పగించేందుకు పావులు కదుపుతోంది. గత ప్రభుత్వ హయాంలో సిద్ధం చేసిన ప్రతిపాదనలను అమలు చేస్తే స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెరుగుతుంది. కానీ అధికారం చేపట్టి మూడు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికే ఉక్కు పరిరక్షణ కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు నెల రోజులుగా చంద్రబాబు, లోకేష్, పవన్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తున్నా అవకాశం కల్పించడం లేదు. కేంద్రంతో లాలూచీ పడి స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కూడా సహకరిస్తోందనే అనుమానాలు ఇటీవల జరుగుతున్న పరిణామాలతో బలపడుతున్నాయి.

ఇలా.. ఏ ఒక్క హామీ గురించి ప్రస్తావన సైతం తీసుకురాకుండా.. వంద రోజుల పాలనను మమా అనిపించేశారు. గత ఐదేళ్ల కాలంలో వెలుగొందిన విశాఖపట్నం జిల్లాను.. అడుగడుగునా దగా చేస్తూ పాలన సాగిస్తున్న కూటమి నేతల శైలిపై ప్రజలు మండిపడుతున్నారు.



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్న పవన్ కల్యాణ్, చంద్రబాబు

సేవకులకు సత్కారం



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని ఏయూ హైస్కూల్ గ్రౌండ్‌లో 11 రోజుల పాటు నిర్వహించనున్న దివ్య కళా మేళా నిర్వహణకు, దివ్యాంగులకు వివిధ రూపాల్లో ఆర్థిక సహాయం అందించిన దాతలను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ సత్కరించారు. వారికి జ్ఞాపికలు అందజేశారు. దివ్యాంగుల ఉపకరణాలకు సీఎస్సార్ కింద రూ.50 లక్షలు అందించిన ఐవోసీఎల్, రూ.15 లక్షల అందజేసిన దివిస్ ల్యాబొరేటరీ, రూ.20 లక్షలు సమకూర్చిన హెచ్‌పీసీఎల్. రూ.10 లక్షలు అందించిన గెయిల్, రూ.15 లక్షలు ఇచ్చిన కోరమాండల్, రూ.4 లక్షలు అందించిన ఏపీడీఐఐసీ ప్రతినిధులను రాష్ట్ర గవర్నర్, కేంద్ర మంత్రి అభినందించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పేందుకు గాను ఔత్సాహికులకు గవర్నర్, కేంద్ర మంత్రి చేతుల మీదుగా రుణ పత్రాలు అందజేశారు. డెయిరీ, గొర్రెల ఫారం, ఫ్యాన్సీ స్టోర్, పేపర్ ఇండస్ట్రీ యూనిట్ తదితర వ్యాపారాల నిర్వహణ కోసం పది మందికి రూ.27 లక్షల రుణాలను వేర్వేరుగా మంజూరు చేస్తూ సంబంధిత పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, విభిన్న ప్రతిభావంతుల శాఖ డైరెక్టర్, జిల్లా సహాయ సంచాలకులు మాధవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ గాలులకు కూలిన ప్రధాన ముఖద్వారం

దివ్య కళా మేళా ప్రారంభానికి ముందే మేళా ప్రధాన ముఖద్వారం కూలిపోయింది. సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన ముఖద్వారం పైభాగం కూలిపోయింది.

స్వర్ణాంధ్ర-2047పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: స్వర్ణాంధ్ర –2047పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాలులో స్వర్ణాంధ్ర- 2047పై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రతి శాఖలో ప్రస్తుత లక్ష్యాలు, ఐదేళ్లలో సాధించనున్న ఫలితాలపై ముందస్తు ప్రణాళికలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలన్నారు. లక్ష్య సాధనలో ఏటా 15 శాతం ఆర్థిక పురోగతి కనిపించాలన్నారు. అలాగే స్వర్ణాంధ్ర - 2047 విజన్‌ను రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో పర్యాటక, వ్యవసాయ అనుబంధ రంగాలు, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు తదితర రంగాల్లో ఆర్థిక పురోగతి ఉండే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. వచ్చే నెల 15 నాటికి 'స్వర్ణాంధ్ర' విజన్ సిద్ధం కావాలని సీఎస్ ఆదేశాల మేరకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.


మనోడు కాదా.. వీఆర్‌లో ఉంచేయ్..!

- రేంజ్ వీఆర్‌లో 57 మంది సీఐలు
- ఈ నెల 1 నుంచి 14వ తేదీ మధ్యే 24 మంది వీఆర్‌కు..
- పోస్టింగ్‌ల కోసం మూడు నెలలుగా ఎదురుచూపులు
- సిఫార్సు లేఖల కోసం రూ.లక్షలు వసూలు
- స్థానాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు బేరం

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో బదిలీల ప్రక్రియ కూటమి ప్రజాప్రతినిధులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇన్‌స్పెక్టర్ నుంచి ఆ కింది స్థాయి పోస్టింగ్‌లు ఎమ్మెల్యేలకు వరంగా మారాయి. స్టేషన్‌కు ఓ రేటును ఫిక్స్ చేసి సిఫార్సు లేఖలు మంజూరు చేస్తున్నారు. టీడీపీకి అనుకూలంగా లేని వారిని మాత్రం వీఆర్‌లోనే ఉంచేలా పోలీస్ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో విశాఖ రేంజ్ వీఆర్‌లో ప్రస్తుతం 57 మంది ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరిలో కొందరు గత మూడు నెలలుగా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. కొంత మందిని కక్షపూరితంగా.. మరికొంత మంది నుంచి బేరం కుదరకపోవడంతో వీఆర్‌కే పరిమితమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

ముందు సిగపట్లు.. తరువాత సర్దుబాట్లు

ఐపీఎస్‌ల నుంచి ఏసీపీ వరకు నియామకాలు చినబాబు కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. కానీ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆ కింది స్థాయి సిబ్బంది విషయంలో స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేల సిఫార్సులు ఉంటేనే ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు లభిస్తున్నాయన్న టాక్ నడుస్తోంది. దీంతో అనేక మంది సీఐలు ఇప్పటికే ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ బదిలీల ప్రక్రియ ప్రారంభంలో టీడీపీ, జనసేన ఎమ్మెల్యేల మధ్య అంతర్గత విభేదాలు తలెత్తాయి. బదిలీల విషయంలో తమ మాట చెల్లలేదని జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్‌లు అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ తరువాత మాత్రం అందరూ చక్కగా సర్దుకున్నారు. ఎవరి నియోజకవర్గాల్లో వారిదే పెత్తనం సాగాలన్న ఒప్పందానికి వచ్చారు. అలాగే ఎంపీకి మాత్రం ప్రతి నియోజకవర్గంలో ఒక పోస్టింగ్‌కు అవకాశం కల్పించాలన్న అవగాహన కుదుర్చుకున్నారు.



స్టేషన్‌కో రేటు

కొంత మంది ఎమ్మెల్యేలు స్టేషన్‌కు ఒక రేటును ఫిక్స్ చేశారు. దీని ప్రకారం సిఫార్సు లేఖలకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ఇచ్చిన వారికి నచ్చిన పోస్టింగ్‌లు వరిస్తున్నాయి. కొంత మంది సీఐలపై మాత్రం కొందరు ఎమ్మెల్యేలు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. తమకు అనుకూలంగా లేరన్న నెపంతో సిటీ నుంచి కొందరిని రేంజ్ వీఆర్‌కు పంపించేలా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అలాగే ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కూడా అక్కడి స్థానిక ఎమ్మెల్యేలు ఇదే తరహాలో వ్యవహరించారు. దీంతో వీఆర్‌లో ఉన్న వారి సంఖ్య పెరుగుతూ పోతోంది. ప్రస్తుతం వీఆర్‌లో 57 మంది ఉండగా.. ఇందులో ఈ నెల 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 24 మంది వీఆర్‌కు వచ్చారు. జిల్లాల్లో సీఐల స్థానాలు ఖాళీగా ఉన్నప్పటికీ.. వీరికి పోస్టింగ్‌లు మాత్రమే ఇవ్వడం లేదు. అలాగే జూన్ నుంచి కూడా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్న వారూ ఉన్నారు. అయినప్పటికీ.. కూటమి నేతలు వారిపై కనికరం చూపించడం లేదు. వారిని తమ దారిలోకి తెచ్చుకోవడానికే ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దళితుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ బాబూరావు

సీతమ్మధార: దళితుల సమస్యలు పరిష్కరించాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి వీరేంద్రకుమార్‌కు కోరారు. ప్రభుత్వ అతిథిగృహంలో గురువారం కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దళితుల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రస్తావించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి వీరేంద్రకుమార్.. అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బాబూరావు తెలిపారు.

సఫాయిమిత్ర కార్మికుల సంక్షేమమే ధ్యేయం

ఎంవీపీకాలనీ: సఫాయి మిత్ర కార్మికుల సంక్షేమం, ఆరోగ్యమే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ అన్నారు. లాసన్స్ బే కాలనీ ఎం.ఎఫ్-3లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ కలిసి ఆయన సఫాయిమిత్ర కార్మికులకు పొక్లెయిన్లు, పీపీఈ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సఫాయి కార్మికుల కోసం కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛత ఉజ్వల యోజన పథకం ద్వారా రెండు పొక్లెయిన్లను, నమస్తే అనే కార్యక్రమం ద్వారా సఫాయిమిత్ర కార్మికులకు పనిముట్లు అందజేసినట్లు వెల్లడించారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు డ్రైనేజీలో దిగి పనిచేయకుండా ప్రత్యేకమైన వాహనాలను జీవీఎంసీ సమకూర్చిందన్నారు. ఇప్పటికే 15 వాహనాలను సఫాయి మిత్ర కార్మికులకు అందించినట్లు తెలిపారు. ఒక్కొక్క వాహనాన్ని ఐదుగురు కార్మికులు గ్రూప్‌గా కలిసి వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ వాహనాల ద్వారా వచ్చే అద్దె.. వారి కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోందన్నారు. కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, జోనల్ కమిషనర్–3 శివప్రసాద్, వైద్యాధికారి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



పొక్లెయిన్లను అందజేస్తున్న కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్, జీవీఎంసీ కమిషనర్ సంపత్

గవర్నర్‌ను కలిసిన డీఐజీ


గవర్నర్ నజీర్‌ను మొక్క అందజేస్తున్న డీఐజీ గోపీనాథ్

బీచ్‌రోడ్డు: ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు గురువారం నోవాటెల్ హోటల్ వద్ద గవర్నర్‌కు డీఐజీ గోపీనాథ్ మొక్కను అందజేశారు.

వరద బాధితులకు విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న కెమిక పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ సాంబశివరావు

పరవాడ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి ఫార్మాసిటీలోని కెమిక డ్రగ్స్ పరిశ్రమ యాజమాన్యం రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఈ విరాళాన్ని చెక్కు రూపంలో సంస్థ ఎండీ మల్లారెడ్డి తరఫున వైస్ ప్రెసిడెంట్ కె.సాంబశివరావు సీఎం చంద్రబాబుకు అందించారు.

బస్సు కింద పడి యువకుడి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బస్సు కింద పడి మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసుల వివరాల ప్రకారం...సాహుకారి సంతోష్ కుమార్ (28) తల్లిదండ్రులతో కలిసి కంచరపాలెం సుభాష్‌నగర్ ప్రాంతంలో నివాసముంటున్నాడు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద బైక్ షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం 9.30గంటల ప్రాంతంలో విధులకు వెళ్తున్న క్రమంలో ఐటీఐ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో అదుపు తప్పి పడిపోయాడు. బస్సు టైర్ కింద పడి మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వర్షంలో కుర్రాళ్ల ఆటలు

దంచికొట్టిన వాన

విశాఖలో గురువారం భారీ వర్షం కురిసింది. అక్కయ్యపాలెం, ఓల్డ్ డెయిరీ ఫాం, జూపార్కు, కైలాసగిరి, విశాలాక్షినగర్‌తో పాటు మధురవాడ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మెరుపులు, ఉరుములు కాసేపు భయపెట్టాయి. కొమ్మాది సమీపంలో గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రామాద్రి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం


వర్షంలో వెళుతున్న వాహనదారులు




వర్షంలో తడుస్తూ..

కీలక పోస్టుపై మీనమేషాలు

- ఇరిగేషన్ ఎస్ఈ పోస్ట్ ఖాళీ
- ఇన్‌చార్జిని కూడా నియమించని ప్రభుత్వం
- ఇటీవల వరదలు, వర్షాల నష్టాలను అంచనా వేసే నాథుడు కరువు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో కీలకమైన ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) పోస్టు భర్తీపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఆగస్టు 31న ఎస్ఈ సూర్యకుమార్ పదవీ విరమణ చేశారు. నాటి నుంచి నేటి వరకూ ఆ పోస్టు భర్తీ చేయలేదు. కనీసం ఇంచార్జి బాధ్యతలు సైతం ఎవరికీ అప్పగించలేదు. ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికార యంత్రాంగం తడబాటుకు గురైంది. పలు రిజర్వాయర్లలో నీరు పొంగి ప్రవహించడం, గేట్లు ఎత్తివేతలో పర్యవేక్షణ లేకపోవడం, మరమ్మతులకు గురైన పలు రిజర్వాయర్ల పనులు చేపట్టే నాథుడు కరువయ్యాడు. కనీసం వరద నష్టాన్ని అంచనా వేసే అధికారే లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. విశాఖ ఉమ్మడి జిల్లాలో కీలకమైన రిజర్వాయర్లు తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు, కల్యాణపులోవ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ ఎస్ఈ పరిధిలోకే వస్తాయి. ఆయనే పర్యవేక్షించాల్సి ఉంటుంది. వర్షాల సమయానికి రిజర్వాయర్లలో ఎటువంటి ఇబ్బందుల లేకుండా..గేట్లు ఎత్తివేత చూడడం, విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా జనరేటర్లు సిద్ధం చేసుకోవడం వంటి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి. వీటిల్లో ఏ సమస్య ఏర్పడిన భారీ వర్షాల సమయంలో మూల్యం చెల్లించుకోకతప్పదు. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ సిబ్బందికి దిశానిర్దేశం చేసే అధికారే లేకుండాపోయాడు.

పెండింగ్‌లో నీరు–చెట్టు బిల్లులు

కొద్ది రోజులుగా నీరు–చెట్టు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉంది. 17 రోజుల నుంచి 1500 పనులకు సంబంధించిన బిల్లులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా ఉన్నాయి. లక్షలాది రూపాయలను ఎప్పటి కప్పుడు చెల్లింపులు చేయవలసిన బాధ్యతలు ఎస్ఈల పరిధిలో ఉంటుంది. ఎస్ఈ పోస్టు భర్తీ చేయకపోవడంతో ఇరిగేషన్ సంబంధిత వ్యవహారాల్నీ నిలిచిపోయాయి.

వేద పండితులకు నిరుద్యోగ భృతి

26లోగా దరఖాస్తులు చేసుకోవాలి

మహారాణిపేట: వేదాభ్యాసం పూర్తి చేసిన నిరుద్యోగ వేద పండితులకు నెలకు రూ.3వేల భృతి మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వేద పండితులు ఈ నెల 26లోగా సహాయ కమిషనర్(ఏసీ), దేవదాయ ధర్మాదాయ శాఖ, టర్నర్ చౌల్ట్రీ, విశాఖపట్నం చిరునామాకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, విద్యార్హతలు, ప్రభుత్వం/ప్రైవేట్ రంగంలో ఉద్యోగం చేయడం లేదని స్వీయ ధ్రువీకరణపత్రం జత చేయాలని పేర్కొన్నారు.

సంపత్ వినాయగర్ ఆలయ హుండీ ఆదాయం రూ.16 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి శిరీష ఆధ్వర్యంలో గురువారం ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా 14 రోజులకు రూ.16 లక్షలు, బంగారం 8.21 మిల్లి గ్రాములు, వెండి 90 మిల్లిగ్రాములు, యూఎస్ఏ డాలర్లు 22, రూ.111 చెక్కు వచ్చినట్లు ఈవో తెలిపారు. దేవస్థానం ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ ఆర్.పోలస్, శివజ్యోతి, శ్రీవేంకటేశ్వరసేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ల ప్రారంభం

అల్లిపురం: నగరంలో 25 అన్నా క్యాంటీన్లను ప్రారంభించినట్టు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. అన్నా క్యాంటీన్లకు సరఫరా చేసే అక్షయపాత్ర వంటశాలను స్వయంగా పరిశీలించానని తెలిపారు. గురువారం ఎంవీపీ రైతు బజార్ సమీపంలో అన్నా క్యాంటీన్‌ను ఎంపీ భరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, కలెక్టర్ హరేందిర ప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అందరూ కలిసి పేద ప్రజలకు ఆహారాన్ని వడ్డించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు.

గీతా నారాయణ్‌కు 'వైశాఖేశ్వర ఎక్సలెన్స్' అవార్డు

వైశాఖి నృత్యోత్సవ్‌లో ప్రదానం చేయనున్న నటరాజ్ డ్యాన్స్ అకాడమీ


కూచిపూడి కళాకారిణి గీతా నారాయణ్

మద్దిలపాలెం: నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి సూదగాని గీతా నారాయణ్ 'వైశాఖేశ్వర ఎక్సలెన్స్'అవార్డుకు ఎంపికయ్యారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్ ఈ విషయాన్ని వెల్లడించారు. అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు 'వైశాఖీ నృత్యోత్సవ్'పేరిట అఖిల భారత శాస్త్రీయ నృత్యోత్సవం జరగనుంది. 'వైశాఖేశ్వర ఎక్సలెన్స్' అవార్డును ఈ ఏడాదే ప్రవేశపెడుతుండగా.. ఈ అవార్డుకు నిపుణుల కమిటీ గీతా నారాయణ్‌ను ఎంపిక చేసిందని విక్రమ్ కుమార్ గౌడ్ తెలిపారు. వర్ధమాన కూచిపూడి నర్తకీమణుల్లో ధ్రువతారగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన గీతా నారాయణ్‌కు ఈ అవార్డు అందించడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా.. మూడు పదుల వయసులో.. భర్త రవిశంకర్ నారాయణ్ ప్రోత్సాహంతో ఆమె కూచిపూడి నాట్యం నేర్చుకుని తన కలను నెరవేర్చుకున్నారు. ఎస్ఎండీఏలో ప్రిన్సిపాల్ కె.వి.లక్ష్మి వద్ద శిక్షణ పొంది.. తన సహజ ప్రతిభతో పాటు కఠిన సాధన ద్వారా ఈ స్థాయికి ఎదిగారు. ఉద్ధండుల సమక్షంలో ఆమె నాట్య రంగప్రవేశం అంగరంగ వైభవంగా జరిగింది. సత్యభామ పాత్రలో ఒదిగిపోయారు. గంగాదేవిగా అనన్య సామాన్య ప్రతిభ కనబరచి భగీరథ విలాసం నృత్య నాటకానికి వన్నె తెచ్చారు. ఇలా ప్రతిష్ఠాత్మక వేదికలపై ఆమె చేసిన ప్రదర్శనలు అనేక మందికి స్ఫూర్తిగా నిలిచాయి. ఈ క్రమంలో ఆమె 'వైశాఖేశ్వర ఎక్సలెన్స్' అవార్డుకు ఎంపికయ్యారు. 'వైశాఖీ నృత్యోత్సవ్'లో అతిరథమహారథుల చేతులమీదుగా అవార్డును స్వీకరించనున్నారు.

11 ఏళ్ల బాలుడికి ప్రాణం పోసిన వైద్యులు

- 21 రోజులు మృత్యువుతో పోరాటం
- కోలుకోవడంతో డిశ్చార్జి చేసిన వైద్యులు


డిశ్చార్జ్ అనంతరం చరణ్‌ను అభినందిస్తున్న వైద్యులు

మహారాణిపేట: ప్రాణాంతక పరిస్థితిలో ఉన్న 11 ఏళ్ల బాలుడికి కేజీహెచ్ వైద్యులు ప్రాణం పోశారు. తీవ్ర ఫిట్స్, ఊపిరితిత్తుల సమస్యతో స్పృహ లేని పరిస్థితిలో కేజీహెచ్‌కు తీసుకొని వచ్చిన బాలుడికి పిల్లల వైద్యులు హైపర్ వెంటిలేటర్ ద్వారా వైద్య సేవలు అందించారు. 21 రోజులు పాటు మృత్యువుతో పోరాడిన బాలుడు కోలుకోవడంతో గురువారం డిశ్చార్జి చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. వివరాలు ఇలా..

అగనంపూడి ప్రాంతానికి చెందిన అప్పలనాయుడు కుమారుడు చరణ్ (11) ఆగస్టు 31న ఆడుకుంటూ స్పృహ తప్పి పడిపోయాడు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీఎస్.చక్రవర్తి ఆధ్వర్యంలో వివిధ పరీక్షలు నిర్వహించారు. బాలుడుకి పోస్టీరియర్ ల్యూకోఎన్సెఫలోపతి సింద్రోమ్, మల్టీసిస్టమ్ ఇన్ఫ్లమేటరీ సింద్రోమ్ అని నిర్ధారించారు. చరణ్‌ను మూడు రోజుల పాటు హైపర్ వెంటి లేటర్ మీద చికిత్స అందించారు. 21 రోజుల పాటు వైద్య సేవలు అందించారు. చరణ్‌కు బీపీ పెరిగిపోవడంతో కోనింగ్ అనే ప్రాణాంతక పరిస్థితి వచ్చిందని తెలిపారు. బాలుడు కోలుకోవడానికి కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్, జూనియర్ డాక్టర్లు వాసుబాబు, బంగారు, కావ్య సహకరించారన్నారు. చికిత్సకు రూ.10 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని, కేజీహెచ్‌లో కనుక ఉచితంగా వైద్య సేవలు అందించామని డాక్టర్ చక్రవర్తి తెలిపారు. రోజు వారి కూలిగా జీవిస్తున్న తనకు వైద్యులు పుత్రభిక్ష పెట్టారని అప్పలనాయుడు ఆనందం వ్యక్తం చేశాడు.

యువతే దేశ భవిష్యత్.. మత్తుకు బానిస కావొద్దు

కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్


గ్రీన్ వ్యాలీలో మంత్రి వీరేంద్రకుమార్

మధురవాడ: దేశ భవిష్యత్తు, శక్తి యువతేనని కేంద్ర సామాజిక న్యాయం, సాధికార శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ అన్నారు. ఏపీ–ఎస్ఎల్‌సీపీల సందర్శనలో భాగంగా మిథిలాపురి వుడా కాలనీలోని గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఇక్కడ వ్యసన విమోచనలో చికిత్స పొందుతున్న యువత, ఇతర రోగులతో ఆయన మాట్లాడారు. ఇక్కడ చికిత్స తీసుకుని.. వ్యసనాల బారి నుంచి విముక్తి పొంది.. ఇక్కడే పనిచేస్తున్న వారిని పలకరించారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ నిర్వాహకురాలు ఉమా రాజ్‌ను అభినందించిన ఆయన.. చికిత్స తీసుకుంటున్న యువతనుద్దేశించి మాట్లాడారు. యువత వ్యసనాలు, మత్తుకు బానిసలు కాకూడదన్నారు. నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు నుంచి విముక్తి కలిగించడానికి ఎన్‌జీవోలు, బ్రహ్మ కుమారీస్, పండిట్ రవిశంకర్ తదితర సంస్థలతో ఎంవోయూలు చేసుకుంటున్నట్టు చెప్పారు. కొన్ని సంస్థలకు ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం సిబ్బంది, ఇక్కడ చికిత్స పొందుతున్న వారు కేంద్రమంత్రిని సత్కరించారు. జేసీ మయూర్ అశోక్, తహసీల్దార్ పాల్‌కిరణ్ పాల్గొన్నారు.

లంగర్‌ఖానా భూములు పక్కదారి

తగరపువలస: సంగివలస పోలమాంబ ఆలయం ఈవో పరిధిలో ఉన్న లంగర్‌ఖానా భూములు పక్కదారి పడుతున్నాయి. చిట్టివలస నుంచి భీమిలి వరకు సర్వే నంబర్ 61/1లో సుమారు 67 ఎకరాలు వరకు భూములు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రికి రాత్రి నిర్మాణాలు వెలుస్తున్నాయి. గతంలో ఈ మెట్ట భూములను చాలా వరకు రైతులు సాగు చేసుకునేవారు. తరువాత వ్యవసాయన్ని పక్కన పెట్టేసి కొందరు తోటలు పెంచుతుండగా మిగిలిన వారు ఖాళీగా వదిలేశారు. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో చాలావరకు అన్యాక్రాంతమవుతున్నాయి. ఇప్పటికే భీమిలి వైపు లంగర్‌ఖానా భూములలో దేవాదాయశాఖ సిబ్బంది ఆశీస్సులతో నిర్మాణాలు వెలసి విక్రయాలు జరిగిపోతుండగా ఇప్పుడు చిట్టివలస పరిధిలో కూడా భూములు చేతులు మారుతున్నాయి. సర్వేనంబర్ లాక్ చేసినా పక్క సర్వేనంబర్లు వేసి హద్దులతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇటీవల జీరుపేటలో సుమారు 69 సెంట్లు లంగర్‌ఖానా భూమిని స్థానికులు రెడీమేడ్ ఫెన్సింగ్ వేసి విక్రయానికి పెట్టడం వివాదాస్పదమయింది. దేవదాయశాఖ ఇప్పటికైనా మేల్కొకపోతే కోట్ల విలువైన మొత్తం లంగర్‌ఖానా భూములకే ఎసరు పెట్టే పరిస్థితి వస్తుందని స్థానికులు అంటున్నారు. వందల ఏళ్ల క్రితం దాతలు ఇచ్చిన లంగర్‌ఖానా భూములకు రక్షణ కల్పించాలంటున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

విశాఖ నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు



మధురవాడ: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. ఫ్రెండ్లీగా మెలుగుతామని విశాఖ నార్త్ జోన్(మధురవాడ) ఏసీపీ అప్పలరాజు అన్నారు. ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వర్తించిన సునీల్ వీఆర్‌కి వెళ్లడంతో.. మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్ పెంటారావు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆయన స్థానంలో విశాఖ రేంజ్ నుంచి బదిలీపై వచ్చిన అప్పలరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు కలిగి ఉండేలా పనిచేస్తామని చెప్పారు. గతంలో తాను ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశానని.. ఈ ప్రాంతంపై అవగాహన ఉందన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానమే లక్ష్యం


ఆలిండియా రేడియో స్టేషన్ ప్రాంగణంలో అమ్మ పేరిట మొక్క నాటుతున్న కమిషనర్

డాబాగార్డెన్స్: స్వచ్ఛభారత్ మిషన్ ఆదేశాల మేరకు దేశమంతా జరుగుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ గురువారం ఆలిండియా రేడియోలో ప్రసంగిస్తూ పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవా 2024 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత స్వభావం, స్వచ్ఛత సంస్కారం పరిశుభ్రతకు నిదర్శనమని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో మొదటి స్థానమే లక్ష్యంగా ప్రజల సహకారంతో కృషి చేస్తున్నట్టు కమిషనర్ వివరించారు. అనంతరం ఆలిండియా రేడియో అధికారులతో కలిసి అమ్మ పేరిట ఒక మొక్క అనే నినాదంతో మొక్కను కమిషనర్ నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరం 28 శాతం పచ్చదనం కల్గి ఉందని, ప్రజల సహకారంతో 50 శాతం పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆలిండియా రేడియో స్టేషన్ సుబ్బారావు, సూర్యప్రకాశరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

కొత్త వైద్య కళాశాలల్లో సీట్లు భర్తీ చేయాలి



కృష్ణా కళాశాల వద్ద పీడీఎస్‌వో జిల్లా కమిటీ నిరసన

మద్దిలపాలెం: రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి సీట్లు భర్తీ చేయాలని పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. అలాగే పులివెందులలోని వైఎస్సార్ వైద్య కళాశాలకు మంజూరైన సీట్లను అనుమతిని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మెడికల్ కమిషన్ డైరెక్టరేట్‌కు రాసిన లేఖను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర చర్యలను ఖండిస్తూ గురువారం మద్దిలపాలెంలోని వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ విద్యా సంవత్సరంలో జాతీయ మెడికల్ కమిషన్‌ను ఐదు కళాశాలలకు అనుమతి కోరగా రెండు కళాశాలలకు 50 సీట్లతో అడ్మిషన్లకు అనుమతి మంజూరు చేసిందన్నారు. పులివెందుల కళాశాలలో మౌలిక సదుపాయాలను కల్పించలేదని, ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లను చేపట్టలేమని రాష్ట్ర ప్రభుత్వం జాతీయ మెడికల్ కమిషన్‌కు లేఖ రాయడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. కార్యక్రమానికి పీడీఎస్‌ఓ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శివ పదం సంకీర్తన యజ్ఞం


కీర్తనలు ఆలపిస్తున్న తెన్నేటి, ఓలేటి సోదరీమణులు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ, వీఎండీఏ ప్రతినిధులు రాజు, రాంబాబు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, విశాఖ రుషిపీఠం సత్సంగసభ సంయుక్త ఆధ్వర్యంలో శివ పదం సంకీర్తన యజ్ఞం ఆధ్యాత్మిక కార్యక్రమం గురువారం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ, కళాభారతి అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి డాక్టర్. గుమ్మలూరి రాంబాబు, కేవీఎస్‌శ్యామ్, అన్నంరాజులు ప్రారంభించారు. రుషిపీఠం నిర్వాహకులు కందాళ గాయత్రీ, వేంకట సత్యశ్యామ్ నేతృత్వంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ తన ప్రారంభోపన్యాసం చేశారు. శివపదముల రచన, గానం, గాయనీమణులు తదితర వివరాలను తెలియజేశారు. పరమశివుని ధ్యానించేవారికి సులభతరంగా ఉండేలా కొన్ని పద్యాలను రచించామన్నారు.వాటికి కొందరు సంగీత విద్వాంసులు గీతాలను స్వరపరిచారన్నారు. ఈ గేయాలాపనకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందన్నారు. కళాభారతి వేదికగా శివపదం పద్యాలకు గాత్రంతోపాటు నృత్యం జోడించి కళాకారులు చేసిన ప్రయోగాత్మక ఆధ్యాత్మిక సమేళనం ఆకట్టుకుంది. అనంతరం వారి వ్యాఖ్యానంతో తెన్నేటి సోదరీమణులు, ఓలేటి సోదరీమణులు శివపదాలకు రాగయుక్తంగా బృందగానం చేసి సభికులను అలరించారు. యావత్ సభాప్రాంగణం శివనామ స్మరణతో, ఆధ్యాత్మిక అనుభూతితో పరవశించింది. ఈ కార్యక్రమంలో ప్రధాన నిర్వాహకులు మీకె.వి.ఎస్.శ్యామ్, కందాళ అరుణగాయత్రి, వీవీ ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.

పండగ వేళ ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–షాలిమర్ (08508) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ ఒకటి నుంచి నవంబరు 26వ తేదీ వరకు నడుస్తుంది. ఈ రైలు ప్రతీ మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరుతుంది. షాలిమర్–విశాఖపట్నం (08507) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 2 నుంచి నవంబరు 27వ తేదీ వరకు నడుస్తుంది. ఈ రైలు షాలిమర్‌లో ప్రతి బుధవారం తెల్లవారు 5 గంటలకు బయలుదేరి.. అదే రోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం–అరకు (08525) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజూ విశాఖపట్నంలో ఉదయం 8.30 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు అరకు చేరుకుంటుంది. అరకు–విశాఖపట్నం(08526) స్పెషల్ అరకులో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి రాత్రి 6 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలు అక్టోబరు 5 నుంచి 15వ తేదీ వరకు నడుస్తుంది.

వరదలకు గిరిజనుల జీవితాలు చిన్నాభిన్నం

- దెబ్బతిన్న రోడ్లు, ముంపునకు గురైన పంట పొలాలు
- వారం రోజులు గడుస్తున్నా.. పరామర్శకు వెళ్లని అధికారులు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి


వివరాలు వెల్లడిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.కె.వీధి మండలం దారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ, సీలేరు, గాలికొండ, మొదలైన పంచాయతీల్లో భారీ వర్షాల కారణంగా వేలాది మంది గిరిజనులు విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. అల్లిపురంలోని సీపీఐ విశాఖ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల అల్లూరి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటించిందన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు అల్లూరి జిల్లాలో వేలాది గిరిజన కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడ్డాయని, వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. చత్రాపల్లిలో ఓ మహిళ మృతి చెందినట్టు తెలిపారు. భారీ వరదలకు దారకొండ పంచాయతీలో 22 గ్రామాలు, గుమ్మిరేవుల పంచాయతీలో 4, దుప్పులవాడ పంచాయతీలో 17 గ్రామాలు, గాలికొండ పంచాయతీలో వివిధ గ్రామాల్లో నివసిస్తున్న వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. దారకొండ మండలంలోని దారపురంలో నివసిస్తున్న 21 కుటుంబాలకు చెందిన ఇళ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో నడుము లోతు నీరు ఇప్పటికీ ప్రవహిస్తోందన్నారు. చిన్న పాటి రోడ్లు కూడా ధ్వంసం కావడంతో గిరిజనులు పడ్డ కష్టాలు బాహ్య ప్రపంచానికి తెలియలేదన్నారు. గత 50 ఏళ్ల కాలంలో ఇలాంటి భారీ వర్షాలను తాము చూడలేదని గిరిజనులు తెలిపినట్టు చెప్పారు. ఇంతటి ప్రకృతి విపత్తు చోటు చేసుకుని వారం గడిచినా.. ఇప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. కనీసం పరామర్శకు కూడా రాలేదని గిరిజన ప్రజలు వాపోతున్నారన్నారు. రెవెన్యూ శాఖకు చెందిన ఒకరిద్దరు అధికారులు వచ్చి గిరిజన గ్రామాలను పరిశీలించినా.. వారి నుంచి ఎటువంటి సాయం అందలేదన్నారు. వ్యవసాయ భూముల ఆనవాళ్లు లేకుండా పోయి గిరిజనులు బాధపడుతుంటే రెవెన్యూ యంత్రాంగం తీరు చాలా దారుణంగా ఉందన్నారు. రెవెన్యూ శాఖ ఇచ్చిన పట్టా భూములకే నష్ట పరిహారం ఇస్తామని అధికారులు సరికాదన్నారు. కొండ ప్రాంతం కావడంతో జరిగిన నష్టాన్ని అంచనా వేయడం అంత సులభం కాదన్నారు. విజయవాడ వరద బాధితుల మాదిరిగా భారీ వర్షాలకు నష్టపోయిన గిరిజనులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. నిత్యావసర వస్తువులు అందించాలని, దెబ్బ తిన్న ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించాలని, అన్ని రకాల భూములకు పంట నష్టం చెల్లించాలని, వరద కోతకు గురైన భూములను సాగుకు అనుకూలంగా తయారు చేయాలని, సాగుకు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయించాలని, బాధితులకు ఉపాధి హామీ పథకంలో ప్రత్యేక పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, సి.ఎన్.క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.